క్లుప్తంగా

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఆత్మకూరు : గతంలో నేరాలకు పాల్పడి రౌడీ షీటర్ ఓపెన్ అయిన నేరస్తులు మళ్లీ నేరాలకు పాలుపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఆర్.సంతోష్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. గొడవలు, విధ్వంసం, సెటిల్మెంట్లు చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాలుపడితే సహించేంది లేదని అన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రజలు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలని, మధ్యవర్తిత్వంతో నష్టపోవద్దని సూచించారు.

మేడారానికి ఆర్టీసీ బస్సులు

పరకాల : పరకాల ఆర్టీసీ డిపో నుంచి మేడారానికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ రవిచందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు 262 ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందజేసే ఉచిత బస్సు ప్రయాణం మేడారం గ్రామానికి వర్తిస్తుందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి



కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సజీవ దహనమైన తోడేటి సౌందర్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని జనతాదళ్ (సెక్యులర్) పార్టీ జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు కోరారు. శనివారం ఆయన మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ ఆధారిత కుటుంబానికి చెందిన సౌందర్య మృతి చెందిడం ఆ కుటుంబానికి తీరని లోటు మిగిల్చిందన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండి ఆదుకోవాలని కోరారు.

12న ప్రెస్‌క్లబ్ ఎన్నికలు



పరకాల : ఈనెల12వ తేదీన పరకాల ప్రెస్‌క్లబ్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రెస్‌క్లబ్ ఎన్నికల అధికారులు మెండు రవీందర్, రేపాల నర్సింహారాములు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ సభ్యుల జాబితాను ప్రకటించారు. ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 11గంటల నుంచి 12 గంటల లోపు నామినేషన్ల ఉపసంహరణ, మధ్యాహ్నం 1 గంటకు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితా ప్రదర్శన, మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు పోలింగ్ నిర్వహణ, సాయంత్రం 5గంటలకు కౌంటింగ్ ప్రారంభించి విజేతలను ప్రకటించడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

'బీఆర్‌ఎస్ ద్రోహాన్ని మరువలేం'

హన్మకొండ చౌరస్తా: కొట్లాడి సాధించుకున్న తెలంగాణకు తీరని ద్రోహం చేసిన బీఆర్‌ఎస్ పార్టీ చరిత్రను ఎవరూ మరిచిపోలేరని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేంద్రప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ ఆఫీసులో శనివారం జరిగిన సమావేశంలో బీఆర్‌ఎస్ త్యాగాలు, ఉద్యమ చరిత్రను ఎవరూ చెరిపేయలేరన్న దేశపతి వ్యాఖ్యలపై రాజేంద్రప్రసాద్ తీవ్రంగా స్పందించారు. ఇంకా ఎన్నాళ్లు గడీలకు ఊడిగం చేస్తావని దేశపతిని ఉద్దేశించి ప్రశ్నించారు. నిజమైన ఉద్యమకారులను దేశపతి కించపరిచారని విమర్శించారు. ప్రొఫెసర్ హరగోపాల్, కాశీం, విమలక్కపై ఉపా కేసులు, దేశ ద్రోహం కేసులు పెడితే దేశపతి ఎందుకు ఖండించలేదని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు ఊరుకోరన్న విషయాన్ని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గ్రహించాలని తెలిపారు.

ఆ ఇద్దరు భారత శాంతి దూతలే

హన్మకొండ కల్చరల్: అంతర్జాతీయ శాంతి సంస్థ 'వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ' ప్రదానం చేసే భారత్ శాంతి దూత్ అవార్డులను గతంలో అందుకున్న వారిలో ఇద్దరు ఉండటం విశేషం. భారత్ శాంతి దూత్ అవార్డు అందుకున్న ఇద్దరిలో ఒకరు ప్రొఫెసర్ ఎమ్ఎస్ స్వామినాథన్ కాగా, మరొకరు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు. ఈ మేరకు వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకుడు మహ్మద్ సిరాజుద్దీన్ శనివారం మాట్లాడుతూ సంస్థ నుంచి అందించే భారత శాంతి దూత్ అవార్డులను 2017వ సంవత్సరానికి 2018, మార్చి 10న ఎంఎస్ స్వామినాథన్‌కు అందజేశామని, 2020వ సంవత్సరానికి పీవీ నర్సింహారావుకు ప్రకటించిన అవార్డును 2021, అక్టోబర్ 23న పీవీ కుమార్తె వాణీదేవికి అందజేసినట్లు వివరించారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



కమలాపూర్ : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్



ఎల్కతుర్తి : క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఐ

కమలాపూర్ : ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని తహసీల్దార్ పాలకుర్తి మాధవి అన్నారు. మండలంలోని గూడూరులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుమ్మరి రమాకాంత్ (నాని) స్మారకార్థం ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె శనివారం ప్రారంభించారు. టోర్నీ ప్రారంభానికి ముందు రమాకాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ద్విచక్ర వాహన చోధకులు వాహనాలు హెల్మెట్ ధరించాలని, వాహనాలను అజాగ్రత్తగా నడిపి ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చొద్దన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని, యువత క్రీడలపై ఆసక్తి కనబర్చడం అభినందనీయమన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, స్నేహపూర్వక వాతావరణంలో క్రీడాపోటీలను కొనసాగించాలని సూచించారు. ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీకాంత్, శ్రీనివాస్, ఎంపీటీసీ లక్ష్మీరవీందర్, కార్యదర్శి వినీల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అంకతి సాంబయ్య, మాజీ ఉపసర్పంచ్ కుమారస్వామి, క్రీడాకారులు లక్ష్మణ్, రాజేందర్, రాజు, కుమార్, దేవేందర్, కృష్ణ, ప్రశాంత్, పున్నం, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సూరారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్సై రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులను పరిచయం చేసున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలని, సన్మార్గంలో నడవాలన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. సమాజిక సేవల్లో యువత పాలుపంచుకోవాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి 15వేలు, మూడో బహుమతి రూ. 10వేలు అందజేయనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, నాయకులు పొన్నం అనూప్, టీపీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, గోలి రాజేశ్వర్‌రావు, సంతాజీ, గొర్రె మహేందర్, పాక రమేష్, హింగె శ్రీకాంత్, బాబురావు, శీలం అనిల్‌కుమార్, గొడిశాల నరేష్, రాజయ్యగౌడ్ పాల్గొన్నారు.

వదంతుల వ్యాప్తితో గ్రామాల్లో అప్రమత్తం

ఐనవోలు : చిన్నపిల్లలను కిడ్నాప్ చేస్తున్నారని సోషల్ మీడియాలో వస్తున్న వదంతులతో గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తమయ్యారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వారి వివరాలు క్షుణ్ణంగా తెలుసుకుంటూ ఆరా తీస్తున్నారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా డయల్ 100కు కాల్‌చేసి పోలీసులకు సమాచారం అందిస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ మెసేజ్‌లు చేస్తుండటంతో పాటు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వదంతులతో గ్రామాల్లో సంచరించే కొత్త వ్యక్తులను అనుమానాస్పదంగా చూస్తున్నారు. వారి ఆచూకీ వివరాలు తెలిపే వరకు వదలిపెట్టడం లేదు.

అనుమానమొచ్చి 100కు ఫోన్ చేశారు

వరంగల్– ఖమ్మం రహదారి చింతకుంట క్రాస్ సమీపంలో శుక్రవారం రాత్రి అపరిచిత వ్యక్తులను కొంతమందిని గ్రామస్తులు చూపి వారిపై అనుమానం వ్యక్తం చేస్తూ డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారిని ప్రశ్నించారు. తాము మహారాష్ట్రకు చెందిన వారమని, తాత్కాలిక పనుల నిమిత్తం ఖమ్మంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. వారిలో ఒకరు అనారోగ్యానికి గురికాగా మహారాష్ట్రకు వెళ్తున్న క్రమంలో రహదారిపై కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆగినట్లు వారు పోలీస్‌లకు వివరించారు. అదే విధంగా వెంకటాపూర్ గ్రామంలో ఐనవోలు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ గ్రామస్తులు వెంబడించి దేహశుద్ధి చేశారు. ఇదిలా ఉండగా శనివారం ఉదయం మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఎస్సీ కాలనీలో సంచరిస్తుండగా ఆయనను ఎక్కడి నుంచి వచ్చారని పలువురు ప్రశ్నించారు. ఒక్కొక్కరికి ఒక్కోలా సమాధానం



అపరిచిత వ్యక్తిని విచారిస్తున్న పోలీసులు

చెప్పడంతో అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతన్ని స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా.. బుడిగ జంగాలకు చెందిన వారమని, పొట్టకూటి కోసం గ్రామంలో భిక్షాటన చేస్తున్నట్లు తెలిపారు. దీంతో అతన్ని పోలీసులు వదిలేశారు. సోషల్ మీడియాలో వస్తున్న అవాస్తవాలను నమ్మి ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని సీఐ శ్రీనివాస్ సూచించారు

కిడ్నాప్ వదంతులు సృష్టిస్తే కఠిన చర్యలు

వేలేరు : చిన్న పిల్లలను కిడ్నాప్ చేసే ముఠాలు సంచరిస్తున్నాయనే వదంతులు సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై డి.హరిత శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. చిన్నపిల్లలకు మత్తు పదార్థాలు, చాకెట్లు ఇస్తూ కిడ్నాప్ చేస్తున్నారనే తప్పుడు సమాచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతుందని తెలిపారు. పిల్లలను కిడ్నాప్ చేసే గ్యాంగ్‌లు మండలంలో సంచరించడం లేదని, పిల్లల తల్లితండ్రులు భయాందోళనకు గురికావద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



రాజు(ఫైల్)

వేలేరు : ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్యహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై డి.హరిత తెలిపిన వివరాలు.. వేలేరు మండల కేంద్రానికి చెందిన సూత్రపు రాజు(42) టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా, రాజు ఇటీవలే అప్పులు తీసుకువచ్చి కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. రాజు ప్రవర్తన నచ్చక టిప్పర్ యజమాని డ్రైవర్‌గా తొలగించి వేరే వ్యక్తిని నియమించుకున్నాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రాజు శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నేడు త్యాగరాజ ఉత్సవాలు ప్రారంభం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ సిద్ధార్థనగర్ కాలనీ ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవాలను ఆదివారం ప్రారంభించనున్నట్లు బాహ్యవరపు విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు త్యాగరాజ వేషధారణలో నగర సంకీర్తన సేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంగీత కళాకారులు, తదితరులు హాజరవుతాయని తెలిపారు.

మహమ్మద్ అన్వర్‌కు డాక్టరేట్

కాజీపేట అర్బన్: అయాన గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్, సామాజిక వేత్త మహమ్మద్ అన్వర్‌కు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ యూఎస్‌ఏ గౌరవ డాక్టరేట్‌ను శనివారం అందజేసింది. నగరానికి చెందిన అన్వర్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలకు గాను చెన్నైలోని భారతీయ విద్యా భవన్‌లో గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నిర్వహించిన కార్యక్రమంలో అన్వర్‌కు డాక్టరేట్ పట్టాతో పాటు గోల్డ్‌మెడల్‌ను అందజేశారు.

టీ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కార్యదర్శిగా సుభానీ

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ రాయపురకు చెందిన మహ్మద్ సుభానీ నియమితులయ్యారు. ఈ మేరకు కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు సన్నీషా ఉత్తర్వులు జారీ చేసినట్లు సుభానీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సన్నీషా, సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బాలినే శ్రీనివాసరావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

ఖిలా వరంగల్: గతనెల 24న శాంతినగర్ కరీమాబాద్ రోడ్డుపై నర్సంపేటకు చెందిన మోర సునీల్ తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దాంతో మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ సహాయంతో ఆ ఫోన్‌ను పోలీసులు గుర్తించి ఇన్‌స్పెక్టర్ మల్లయ్య చేతుల మీదుగా బాధితుడు సునీల్‌కు శనివారం అందజేశారు. సీఈఐఆర్ యాప్ గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

రిటైర్డ్ ఉద్యోగులు సమాజ సేవకు పాటుపడాలి

కమలాపూర్ : ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు తమ శేష జీవితం సమాజ సేవకు పాటుపడే విధంగా కృషి చేయాలని సబ్ పోస్ట్‌మాస్టర్ ఆడెపు చంద్రమోహన్ అన్నారు. మండలంలోని శనిగరం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ కె.శ్రీనివాసాచారి ఉద్యోగ విరమణ పొందగా ఆయన ఉద్యోగ విరమణ వీడ్కోలు సన్మాన సభ బ్రాంచ్ పోస్టాఫీస్ ఆవరణలో శనివారం ఘనంగా జరిగింది. పోస్టల్ సిబ్బంది శ్రీనివాసాచారి దంపతులను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించారు. అనంతరం ఎస్పీఎం చంద్రమోహన్ మాట్లాడుతూ.. తపాలా శాఖలో శ్రీనివాసాచారి సుమారు 35 ఏళ్లుగా సేవలందించారని అన్నారు. ఆయన చేసిన సేవతోనే శనిగరం బ్రాంచ్ ఉత్తమ బ్రాంచ్ ఆఫీస్‌గా రికార్డుకు ఎక్కిందన్నారు. పోస్టల్ వ్యవస్థ లక్ష్యానికి అనుగుణంగా శ్రీనివాసాచారి అన్ని టార్గెట్లు పూర్తి చేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. సబ్ పోస్టుమాస్టర్లు ప్రభాకర్, గోపీ కిషన్, రిటైర్డ్ పోస్టుమాస్టర్ పల్లె సమ్మిరెడ్డి, పోస్టల్ సిబ్బంది విద్యాసాగర్, సమ్మయ్య, తిరుపతి, రవళి, అఖిల, గాయత్రి, సమ్మయ్య, కిరణ్, దినేష్, రాజేందర్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసాచారి దంపతులను సన్మానిస్తున్న సిబ్బంది

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

దామెర : మండలంలోని డిస్నీల్యాండ్ ఇ-టెక్నో పాఠశాలలో పదోతరగతి చదువుతున్న జంగ మణి సంకల్ప్ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ డి. శోభారాణి శనివారం తెలిపారు. జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబీషన్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. హైడ్రాలిక్ స్టాండ్స్ టువీలర్స్ అనే అంశంపై ప్రదర్శన ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థిని పాఠశాల ముఖ్య సలహాదారులు దయ్యాల మల్లయ్య, సదయ్య, బాలుగు లక్ష్మీనివాసం, కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేష్‌ఖాను, దీనేష్‌చందర్ అభినందించారు. ఉపాధ్యాయులు శివాజీ, రాజిరెడ్డి, ప్రసాద్, సురేష్‌బాబు, రవికుమార్, జయలక్ష్మీ, భావ్య, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన ఎండీ సల్మాన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సల్మాన్‌తో చదువుకున్న మిత్రులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. క్వింటాలు బియ్యంతో పాటు రూ. 10వేల ఆర్థికసాయం అందించారు.

ఆరె సంఘం ఆధ్వర్యంలో

హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన గుండెకారి రమేష్(రవి) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కాగా శనివారం గ్రామ ఆరె సంక్షేమ సంఘం సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ. 5016 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో గుజ్జుల రాజు, వజ్జీర్ శంకర్‌రావు, కుడుతాల రాజేందర్ , కొలె మల్లయ్య, లక్ష్మణ్ రావు, శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

సెలవు ప్రకటించడం హర్షణీయం

● లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ సింగ్ నాయక్

హన్మకొండ: లంబాడ జాతి ఆరాధ్య దేవమైన సంత్ సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వం సెలవురోజుగా ప్రకటించడంపై లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్ సింగ్ నాయక్, రాష్ట్ర నాయకుడు బానోత్ నవీన్ నాయక్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 15న సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించిన సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని ఠాణా నాయక్ విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని సాధారణ సెలవు రోజుగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు జైసింగ్ రాథోడ్, లావుడియా రాజేష్ నాయక్, సమ్మయ్య రాథోడ్, సునీల్‌నాయక్, వెంకట్ నాయక్, తిరుపతి, దేవేందర్, పరమేష్, మాలోత్ బిక్కు, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలి

● ఏసీపీ కిశోర్ కుమార్

దామెర : ఫిర్యాదు దారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏసీపీ కిశోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ.. వర్టికల్ విధానం అమల్లో అలసత్వం వహించితే సహించేదిలేదని అన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రానున్న మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లోని యువతపై దృష్టి సారించి వారు వ్యసనాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై కొంక అశోక్, ఏఎస్సై రాజు, హెడ్ కానిస్టేబుల్ యాకయ్యతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఏసీపీ

చేనేత సంఘాన్ని ఆదుకోవాలి

శాయంపేట : చేనేత సహకార సంఘాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, చేనేత సహకార సంఘం పాలకవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు చేనేత, జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో కలిసి వినతిపత్రం అందించారు. చేనేత సహకార సంఘానికి రావలిసిన పెండింగ్ బకాయిలు, సంఘంలో నిల్వఉన్న వస్త్రాలను కొనుగోలు చేసి చేనేతను కాపాడాలని కోరారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేనేత సంఘాలకు సంబంధించిన బకాయిలు చెల్లించడంతో పాటు ప్రభుత్వం తరుపున వస్త్రాలను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. సంఘం పీఏసీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం, పాలకవర్గ సభ్యులు బాసాని సాంబయ్య, బూర లక్ష్మీనారాయణ, దిడ్డి ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ శాయంపేట మండల ప్రధాన కార్యదర్శి చిందం రవి, చేనేత సంఘం మేనేజర్ రామకష్ణ పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, సభ్యులు

అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి

కమలాపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపి వేయాలని గ్రామానికి చెందిన పుల్ల అన్వేష్ కోరారు. ఈ మేరకు గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ గుండె బాబుకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021 ఆగస్టులో రూ.5 లక్షలతో మంజూరైన బొబ్బిలినగర్ యూత్‌క్లబ్ ప్రహరీగోడ నిర్మించేందుకు మాజీ ఉపసర్పంచ్ మౌటం రమేష్‌కు గ్రామ పంచాయతీలో జరిగిన సమావేశంలో పాలకవర్గ సభ్యులు తీర్మాణం చేసి అప్పగించినట్లు తెలిపారు. కానీ ఆ తీర్మాణం ప్రకారం ప్రొసీడింగ్‌లో ఇచ్చిన లొకేషన్‌లో కాకుండా మరొక లొకేషన్ (ప్రభుత్వ భూమి)లో నిర్మాణం చేపట్టాడని అన్వేష్ ఆరోపించారు. ప్రొసీడింగ్స్‌కు విరుద్ధంగా ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల వేసి అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాగా అన్వేష్ ఫిర్యాదు మేరకు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి ఆ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నట్లు ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

దామెర : గ్రామంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్ కేవీ. రంగాచారి పంచాయతీ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి రోజు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ల లీకేజీల మరమ్మతు చేయడం జరుతుందని పేర్కొన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రతి ఇంటికి మంచి నీటి సరఫరా చేస్తామని అన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నరేష్, కారోబార్ బొబ్బిలి, సిబ్బంది పాల్గొన్నారు.



పైప్‌లైన్ పనులు పరిశీస్తున్న ఎంపీఓ రంగాచారి

ఉపాధిహామీ కూలీల హక్కులను పరిరక్షించాలి

దామెర : ఉపాధిహామీ కూలీల హక్కులను పరిరక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ కోరారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల చెరువులో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలకు హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూలీల హక్కులకు భంగం కలిగిస్తున్న ఎన్ఎంఎంఎస్ ఆధార్ యాప్ బ్యాంకింగ్ అనుసంధానం విధానాన్ని వెంటనే రద్దు చేయాలని అన్నారు. పనిచేసిన కూలీలకు 15 రోజుల్లోపు వేతనాలు అదించాలని అన్నారు. కూలీలు పనిచేసేచోట కనీస సౌకర్యాలు నీడ, నీరు, ప్రథమ చికిత్స, పనిముట్లు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్. నరేష్, రాజు, మహేష్, ఉపాధి కూలీలు ఉన్నారు.



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న రాజేందర్

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

వేలేరు : గ్రామపంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు గ్రామపంచాయతీ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ కోమి అన్నారు. శనివారం గ్రామంలోని వివిధ కాలనీల్లో తిరుగుతూ సిబ్బందితో డ్రైనేజీ, రోడ్లను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీల్లో తాగునీటి పైపులు లీకేజీలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రతిఒక్కరూ ఇంటి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని అన్నారు. చెత్తాచెదారాన్ని రోడ్డుపై పడేయకుండా చెత్తబుట్టల్లో వేయాలని అన్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కోమి